21-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - శివబాబా తప్ప మీకు ఇక్కడ ఇంకేమీ లేదు, అందుకే ఈ దేహపు భానము నుండి కూడా దూరంగా, నిరుపేదల వలె ఏమీ లేనివారిగా అవ్వాలి, నిరుపేదలే రాకుమారులుగా అవుతారు"

ప్రశ్న:- డ్రామా యొక్క యథార్థమైన జ్ఞానము ఏ ఆలోచనలను సమాప్తం చేస్తుంది?

జవాబు:- ఈ అనారోగ్యము ఎందుకు వచ్చింది, ఇలా చేసి ఉండకపోతే ఇలా జరిగి ఉండేది కాదు, ఈ విఘ్నము ఎందుకు వచ్చింది... బంధనము ఎందుకు వచ్చింది... ఈ ఆలోచనలన్నీ డ్రామా యొక్క యథార్థమైన జ్ఞానము ద్వారా సమాప్తమైపోతాయి, ఎందుకంటే డ్రామా అనుసారంగా ఏదైతే జరిగేది ఉందో అదే జరిగింది, కల్పపూర్వము కూడా ఇదే జరిగింది. ఇది పాత శరీరము కావున దీనికి కుట్లు కూడా పడేదే ఉంది, అందుకే ఎటువంటి ఆలోచనలు కలగకూడదు.

పాట:- మేము ఆ మార్గములో నడవాలి... (హమే ఉన్ రాహోం పర్ చల్నా...)

ఓం శాంతి. ఆ మార్గములో నడవాలి... ఏ మార్గము? ఆ మార్గాన్ని ఎవరు తెలియజేస్తారు? తాము ఎవరి సలహాపై నడుస్తున్నారు అనేది పిల్లలకు తెలుసు. సలహా అనండి, మార్గము అనండి లేక శ్రీమతము అనండి - విషయము ఒక్కటే. ఇప్పుడు శ్రీమతముపై నడవాలి, కానీ ఆ శ్రీమతము ఎవరిది? శ్రీమత్ భగవత్ గీత అని వ్రాయబడి ఉంది, కావున తప్పకుండా శ్రీమతము వైపుకు మన బుద్ధియోగము వెళ్తుంది. ఇప్పుడు పిల్లలైన మీరు ఎవరి స్మృతిలో కూర్చున్నారు? ఒకవేళ శ్రీకృష్ణుని స్మృతి అని అన్నట్లయితే అతడిని అక్కడ స్మృతి చేయాల్సి ఉంటుంది. పిల్లలైన మీరు శ్రీకృష్ణుడిని స్మృతి చేస్తారా లేదా? వారసత్వ రూపములో స్మృతి చేస్తారు. మీరు రాకుమారులుగా అవుతారని మీకు తెలుసు. అంతేకానీ జన్మించడంతోనే లక్ష్మీ-నారాయణులుగా అవుతారని కాదు. తప్పకుండా మనం శివబాబానే స్మృతి చేస్తాము ఎందుకంటే శ్రీమతము వారిదే. శ్రీకృష్ణ భగవానువాచ అని అనేవారు శ్రీకృష్ణుడిని తలచుకుంటారు, కానీ ఎక్కడ తలచుకుంటారు? అతడినైతే వైకుంఠములో తలచుకుంటారు. కావున మన్మనాభవ అన్న మాటను శ్రీకృష్ణుడు చెప్పలేరు, మధ్యాజీభవ అని చెప్పగలరు. మీరు నన్ను స్మృతి చేయండి, అతనైతే వైకుంఠములో ఉంటారు. ప్రపంచానికి ఈ విషయాల గురించి తెలియదు. తండ్రి అంటారు - పిల్లలూ, ఈ శాస్త్రాలన్నీ భక్తి మార్గానికి చెందినవి. అన్ని ధర్మశాస్త్రాలలో గీత కూడా వస్తుంది. తప్పకుండా గీత భారత్ యొక్క ధర్మశాస్త్రము. వాస్తవానికి ఇది అందరి శాస్త్రము. శ్రీమత్ సర్వ శాస్త్రమయి శిరోమణి గీత అని అంటారు కూడా. అనగా అన్నింటికన్నా ఉత్తమమైనది. అందరికన్నా ఉత్తమమైనవారు శ్రీశ్రీ అయిన శివబాబా, వారు శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైనవారు. శ్రీకృష్ణుడిని శ్రీశ్రీ అని అనరు. శ్రీశ్రీ కృష్ణుడు లేక శ్రీశ్రీ రాముడు అని అనరు. వారిని కేవలం శ్రీ అని మాత్రమే అంటారు. శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైనవారు ఎవరైతే ఉన్నారో వారే వచ్చి మళ్ళీ శ్రేష్ఠముగా తయారుచేస్తారు. శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైనవారు భగవంతుడు. శ్రీశ్రీ అనగా అందరికన్నా శ్రేష్ఠమైనవారు. శ్రేష్ఠమైనవారి పేరు ప్రఖ్యాతముగా ఉంటుంది. శ్రేష్ఠమైనవారు అని తప్పకుండా దేవీ-దేవతలనే అంటారు, వారు ఇప్పుడు లేరు. ఈ రోజుల్లో శ్రేష్ఠమైనవారు అని ఎవరిని భావిస్తున్నారు? ఇప్పటి లీడర్లు మొదలైనవారిని ఎంత గౌరవిస్తారు. కానీ వారిని శ్రీ అని అనలేరు. మహాత్ములు మొదలైనవారికి కూడా శ్రీ అన్న పదాన్ని ఉపయోగించలేరు. ఇప్పుడు మీకు ఉన్నతోన్నతమైన పరమాత్మ నుండి జ్ఞానము లభిస్తుంది. అందరికన్నా ఉన్నతమైనవారు పరమపిత పరమాత్మ, ఆ తర్వాత వారి రచన. ఆ రచనలో ఉన్నతోన్నతమైనవారు బ్రహ్మా, విష్ణు, శంకరులు. ఇక్కడ కూడా నంబరువారు పదవులు ఉన్నాయి. ఉన్నతోన్నతమైనవారు ప్రెసిడెంట్, ఆ తర్వాత ప్రైమ్ మినిస్టర్, యూనియన్ మినిస్టర్...

తండ్రి కూర్చొని సృష్టి ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తారు. భగవంతుడు రచయిత. ఇప్పుడు రచయిత అన్న పదాన్ని ఉపయోగిస్తే - సృష్టి ఎలా రచింపబడింది అని మనుష్యులు అడుగుతారు. అందుకే త్రిమూర్తి శివుడు రచయిత అని తప్పకుండా చెప్పాల్సి ఉంటుంది. వాస్తవానికి రచయిత (రచించేవారు) అని అనేందుకు బదులుగా రచింపజేసేవారు అని అనడం సరైనది. బ్రహ్మా ద్వారా దైవీ కులాన్ని స్థాపన చేయిస్తారు. బ్రహ్మా ద్వారా ఏ స్థాపన జరుగుతుంది? దైవీ సాంప్రదాయము. శివబాబా అంటారు - ఇప్పుడు మీరు బ్రహ్మా యొక్క బ్రాహ్మణ సాంప్రదాయము వారు. వారు అసురీ సాంప్రదాయము వారు, మీరు ఈశ్వరీయ సాంప్రదాయము వారు, ఆ తర్వాత దైవీ సాంప్రదాయము వారిగా అవుతారు. తండ్రి బ్రహ్మా ద్వారా సర్వ వేద-శాస్త్రాల సారాన్ని కూడా అర్థం చేయిస్తారు. మనుష్యులు ఎంతగానో తికమక చెంది ఉన్నారు. జనాభా నియంత్రణ జరగాలని ఎంతగా తల బాదుకుంటూ ఉంటారు. తండ్రి అంటారు - నేను వచ్చి భారత్ కు

ఈ సేవ చేస్తున్నాను. ఇక్కడ ఉన్నదే తమోప్రధాన మనుష్యులు. 10-12 మంది పిల్లలకు జన్మనిస్తూ ఉంటారు. వృక్షము తప్పకుండా వృద్ధి చెందాల్సిందే. ఆకులు వెలువడుతూనే ఉంటాయి. వాటిని ఎవ్వరూ కంట్రోల్ చేయలేరు. సత్యయుగములో కంట్రోల్ ఉంటుంది - ఒక కొడుకు, ఒక కూతురు, అంతే. ఈ విషయాలను పిల్లలైన మీరే అర్థం చేసుకుంటారు. ముున్ముందు ఇంకా వస్తూ ఉంటారు, అర్థం చేసుకుంటూ ఉంటారు. అతీంద్రియ సుఖము గురించి గోప-గోపికలనే అడగండి అన్న గాయనము కూడా ఉంది. ఇక్కడ మీరు సమ్ముఖముగా విన్నప్పుడు సుఖము అనుభవమవుతుంది, మళ్ళీ వ్యాపార-వ్యవహారాలలోకి వెళ్ళేటప్పటికి అంతటి సుఖము అనుభవమవ్వదు. ఇక్కడ మిమ్మల్ని త్రికాలదర్శులుగా చేయడం జరుగుతుంది. త్రికాలదర్శులను స్వదర్శన చక్రధారులని కూడా అంటారు. ఫలానా మహాత్మ త్రికాలదర్శిగా ఉండేవారని మనుష్యులు అంటారు. మీరు అంటారు - వైకుంఠనాథులైన రాధా-కృష్ణులకు కూడా స్వదర్శన చక్రము గురించి లేక మూడు కాలాల గురించి జ్ఞానము ఉండేది కాదు. కృష్ణుడైతే అందరికీ ప్రియమైనవారు, సత్యయుగ మొదటి రాకుమారుడు. కానీ మనుష్యులు అర్థం చేసుకోని కారణముగా ఏమంటారంటే - మీరు శ్రీకృష్ణుడిని భగవంతునిగా అంగీకరించరు కావుననే మీరు నాస్తికులు. ఇక విఘ్నాలను కలిగిస్తూ ఉంటారు. అవినాశీ జ్ఞాన యజ్ఞములో విఘ్నాలు కలుగుతాయి. కన్యలకు, మాతలకు కూడా విఘ్నాలు కలుగుతాయి. బంధనములో ఉన్నవారు ఎంత సహనం చేస్తారు. ఇక డ్రామానుసారముగా మా పాత్ర ఇలానే ఉందని అర్థం చేసుకోవాలి. విఘ్నాలు కలిగిన తరువాత ఇటువంటి ఆలోచనలు నడవకూడదు - ఇలా చేసి ఉండకపోతే ఇలా జరిగి ఉండేది కాదు, ఇలా చేసి ఉండకపోతే జ్వరం వచ్చేది కాదు... మనము ఇలా అనకూడదు. డ్రామానుసారముగా ఇలా చేసాము, కల్పపూర్వము కూడా చేసాము, అందుకే ఈ ఇబ్బంది కలిగింది. పాత శరీరానికి కుట్లు కూడా పడేది ఉంది. అంతిమము వరకు రిపేర్లు జరుగుతూనే ఉంటాయి. ఇది కూడా ఆత్మకు పాత ఇల్లు. ఆత్మ అంటుంది - నేను కూడా చాలా పురాతనమైనదానిని, నాలో ఎటువంటి శక్తి మిగల్లేదు. శక్తి లేని కారణముగా బలహీనమైన వ్యక్తులు దుఃఖాన్ని అనుభవిస్తారు. మాయ బలహీనమైనవారికి ఎంతో దుఃఖాన్ని ఇస్తుంది. భారతవాసులైన మనల్ని మాయ చాలా బలహీనులుగా చేసేసింది. మనం చాలా శక్తివంతులుగా ఉండేవారము, తర్వాత మాయ బలహీనులుగా చేసేసింది. ఇప్పుడు మళ్ళీ దానిపై విజయం పొందుతాము కావున మాయ కూడా మనకు శత్రువుగా అవుతుంది. భారత్ కే ఎక్కువ దుఃఖము లభిస్తుంది. అందరి నుండి అప్పులు తీసుకుంటున్నారు. భారత్ పూర్తిగా పాతబడిపోయింది. ఎవరైతే బాగా షావుకారులుగా ఉండేవారో, వారే చాలా నిరుపేదలుగా అయ్యేది ఉంది. మళ్ళీ నిరుపేదల నుండి రాకుమారులుగా అవుతారు. బాబా అంటారు - ఈ శరీర భానము నుండి కూడా దూరంగా, ఏమీ లేనివారిగా అయిపోండి. మీకు ఇక్కడ ఏమీ లేదు, ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. కావున మీరు చాలా నిరుపేదలుగా అవ్వాల్సి ఉంటుంది. యుక్తులను కూడా తెలియజేస్తూ ఉంటారు. జనకుని ఉదాహరణ ఉంది - గృహస్థ వ్యవహారములో ఉంటూ కమలపుష్ప సమానముగా ఉండాలి, శ్రీమతముపై నడవాలి, సర్వస్వాన్ని సమర్పణ కూడా చెయ్యాలి. జనకుడు సర్వస్వాన్ని ఇచ్చేసారు, అప్పుడు అతనికి - మీ ఆస్తిని మీరే సంభాళించండి మరియు ట్రస్టీగా అయి ఉండండి అని చెప్పడం జరిగింది. హరిశ్చంద్రుని ఉదాహరణ కూడా ఉంది.

తండ్రి అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఒకవేళ మీరు బీజాన్ని నాటకపోతే మీ పదవి తగ్గిపోతుంది. ఫాలో ఫాదర్, మీ ఎదురుగా ఈ దాదా కూర్చున్నారు. పూర్తిగా శివబాబాను మరియు శివశక్తులను ట్రస్టీలుగా చేసారు. శివబాబా ఏమైనా కూర్చుని సంభాళిస్తారా. ఇతను స్వయంపై స్వయమే ఏమైనా బలిహారమవుతారా. ఇతను మాతలపై బలిహారమవ్వాల్సి ఉంటుంది. మాతలనే ముందు పెట్టాలి. తండ్రి వచ్చి మనుష్యులను దేవతలుగా తయారుచేయడానికి జ్ఞానామృత కలశాన్ని మాతలకే ఇస్తారు. లక్ష్మికి ఇవ్వరు. ఈ సమయములో వీరు జగదాంబ, సత్యయుగములో లక్ష్మిగా ఉంటారు. జగదాంబ గురించిన పాట ఎంత బాగా తయారుచేయబడి ఉంది. ఆమెకు ఎంతో గౌరవము ఉంది. ఆమె ఏ విధంగా సౌభాగ్యవిధాతగా అయ్యారు, ఆమెకు ధనము ఎక్కడి నుండి లభిస్తుంది? బ్రహ్మ నుండి లభిస్తుందా? కృష్ణుడి నుండి లభిస్తుందా? కాదు. ధనము జ్ఞానసాగరుడి నుండే లభిస్తుంది. ఇవి చాలా గుప్తమైన విషయాలు కదా. భగవానువాచ అందరి కొరకు ఉంది. భగవంతుడు అందరివాడు కదా. నన్నొక్కరినే స్మృతి చేయండి అని అన్ని ధర్మాలవారికి చెప్తారు. శివుని పూజారులు ఎంతోమంది ఉన్నారు కానీ వారికి ఏమీ తెలియదు. అది భక్తి అవుతుంది. ఇప్పుడు మీకు జ్ఞానాన్ని ఎవరు ఇస్తారు? అతి మధురమైన తండ్రి. శ్రీకృష్ణుడిని ఈ విధంగా అనరు, అతడిని సత్యయుగ రాకుమారుడు అని అంటారు. శ్రీకృష్ణునికి పూజలు చేస్తారు కానీ వారు సత్యయుగ రాకుమారునిగా ఎలా అయ్యారు అన్నది ఆలోచించరు. ఇంతకుముందు మనకు కూడా తెలియదు. తప్పకుండా మళ్ళీ మనము రాకుమారులుగా-రాకుమారీలుగా అవుతామని పిల్లలైన మీకు ఇప్పుడు తెలుసు, అప్పుడే కదా పెద్దవారైన తర్వాత లక్ష్మీ-నారాయణులను వరిస్తారు. ఈ జ్ఞానము ఉన్నదే భవిష్యత్తు కొరకు, దీని ఫలము 21 జన్మల కొరకు లభిస్తుంది.

కృష్ణుని గురించి అతను వారసత్వాన్ని ఇస్తారు అని అనరు, వారసత్వము తండ్రి నుండే లభిస్తుంది. శివబాబా రాజయోగాన్ని నేర్పిస్తారు. బ్రహ్మ ముఖము ద్వారా వేలాదిమంది బ్రాహ్మణులు వెలువడుతారు, వారికే ఈ శిక్షణ లభిస్తుంది. కేవలం బ్రాహ్మణులైన మీరు మాత్రమే కల్పం యొక్క సంగమయుగానికి చెందినవారు, మిగిలినదంతా కలియుగ సృష్టియే. వారంతా - ఇప్పుడు మేము కలియుగములో ఉన్నామని అంటారు, మీరేమో - మేము సంగమములో ఉన్నామని అంటారు. ఈ విషయాలు ఇంకెక్కడా లేవు. ఈ కొత్త-కొత్త విషయాలను మీ హృదయంలో ఉంచుకోవాలి. ముఖ్యమైన విషయము, తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయడము. ఒకవేళ పవిత్రముగా ఉండకపోతే యోగము ఎప్పటికీ కుదరదు, నియమం అలా లేదు, అందుకే ఇంతటి పదవిని కూడా పొందలేరు. కొద్దిగా యోగాన్ని జోడించినా స్వర్గములోకైతే వెళ్తారు. తండ్రి అంటారు, ఒకవేళ పవిత్రంగా అవ్వకపోతే నా వద్దకు రాలేరు. ఇంట్లో కూర్చొని కూడా స్వర్గములోకి రావచ్చు, మంచి పదవిని పొందవచ్చు, కానీ, ఎప్పుడైతే యోగములో ఉంటారో, పవిత్రముగా ఉంటారో అప్పుడే అది సాధ్యమవుతుంది. పవిత్రత లేకుండా యోగము కుదరదు, మాయ యోగము కుదరనివ్వదు. సత్యమైన హృదయంపై సాహెబ్ రాజీ అవుతారు. ఎవరైతే వికారాలలోకి వెళ్తూ ఉంటారో, వారు - మేము శివబాబాను స్మృతి చేస్తున్నాము అని అంటారు, ఇలా అంటూ వారు తమను తాము సంతోష పెట్టుకుంటారు. ముఖ్యమైనది పవిత్రత. జనాభా నియంత్రణ చేయండి, పిల్లలకు జన్మనివ్వకండి అని అంటారు. ఇది ఉన్నదే తమోప్రధాన ప్రపంచము. ఇప్పుడు బాబా జనాభా నియంత్రణ చేయిస్తున్నారు. మీరందరూ కుమార-కుమారీలు, కావున వికారాల విషయమే లేదు. లేదంటే విషం కారణంగా కుమార్తెలు ఎంతగా సహించాల్సి ఉంటుంది. బాబా అంటారు - చాలా పథ్యము ఉంచాలి. ఇక్కడ మద్యము తాగేవారెవరూ లేరు కదా? తండ్రి పిల్లలను అడుగుతున్నారు. ఒకవేళ అబద్ధం చెప్పినట్లయితే ధర్మరాజు యొక్క కఠినమైన శిక్షలను అనుభవించాల్సి ఉంటుంది. భగవంతుని ఎదురుగానైతే సత్యమే చెప్పాలి. ఎవరైనా మద్యమును కొద్దిగానైనా ఏదైనా కారణం చేత లేక మెడిసిన్ రూపంలోనైనా తాగుతున్నారా? ఎవ్వరూ చేతులు ఎత్తలేదు. ఇక్కడ తప్పకుండా సత్యమే చెప్పాలి. ఏదైనా పొరపాటు జరిగితే - బాబా, నా ద్వారా ఈ పొరపాటు జరిగింది, మాయ చెంపదెబ్బ వేసింది అని మళ్ళీ వ్రాయాలి. ఈ రోజు మాలోకి క్రోధమనే భూతము వచ్చింది, చెంపదెబ్బ వేసాము అని బాబాకు ఎంతోమంది వ్రాస్తారు కూడా. మీకైతే కొట్టకూడదు అని మతము ఇవ్వడం జరిగింది. కృష్ణుడిని రోలుకు కట్టేసినట్లుగా చూపిస్తారు. ఇవన్నీ అసత్యమైన విషయాలు. పిల్లలకు ప్రేమగా శిక్షణను ఇవ్వాలి, వారిని కొట్టకూడదు. భోజనం ఆపు చేయడము, మిఠాయిలు ఇవ్వకుండా ఉండడము... ఈ విధంగా వారిని సరిదిద్దాలి. చెంపదెబ్బ వేయడమనేది క్రోధానికి గుర్తు అవుతుంది, అంటే మహాత్ములపై క్రోధం చేసినట్లవుతుంది. చిన్న పిల్లలు మహాత్ములతో సమానమైనవారు కదా, అందుకే వారిని కొట్టకూడదు. వారిని తిట్టకూడదు కూడా. మేము ఈ వికర్మను చేసాము అన్న ఆలోచన కలిగే విధమైన కర్మలేవీ చేయకూడదు. ఒకవేళ ఏమైనా చేసినట్లయితే వెంటనే వ్రాయాలి - బాబా, మా వలన ఈ పొరపాటు జరిగింది, మమ్మల్ని క్షమించండి, ఇకపై చేయము. పశ్చాత్తాపపడి క్షమాపణలు కోరుకుంటారు కదా. అక్కడ కూడా ధర్మరాజు శిక్షలు వేసేటప్పుడు పశ్చాత్తాపపడి క్షమాపణలు కోరుకుంటారు - ఇకముందు ఎప్పుడూ చేయమని అంటారు. బాబా ఎంతో ప్రేమతో చెప్తారు - అల్లారుముద్దు సుపుత్రులైన పిల్లలూ, ప్రియమైన పిల్లలూ, ఎప్పుడూ అబద్ధం చెప్పకూడదు.

అడుగడుగునా సలహాను అడగాలి. మీ ధనం ఇప్పుడు భారత్ ను స్వర్గంగా తయారుచేయడంలో వినియోగించబడుతుంది, కావున ప్రతి గవ్వ వజ్ర సమానమైనది. మనమేమీ సన్యాసులు మొదలైనవారికి దాన-పుణ్యాలు చేస్తామని కాదు. మనుష్యులు హాస్పిటళ్ళు, కాలేజీలు మొదలైనవి నిర్మించినప్పుడు వారికి ఏమి లభిస్తుంది? కాలేజీలు తెరవడం ద్వారా మరుసటి జన్మలో మంచి విద్య లభిస్తుంది, ధర్మశాలలు నిర్మించడం ద్వారా మహళ్ళు లభిస్తాయి. ఇక్కడైతే మీకు జన్మ-జన్మాంతరాల కొరకు తండ్రి నుండి అనంతమైన సుఖము లభిస్తుంది. అనంతమైన ఆయుష్షు లభిస్తుంది. ఇంతకన్నా ఎక్కువ ఆయుష్షు ఇతర ఏ ధర్మం వారికీ ఉండదు. ఇక్కడ తక్కువ ఆయుష్షుగా లెక్కించడం జరుగుతుంది కావున ఇప్పుడు అనంతమైన తండ్రిని నడుస్తూ-తిరుగుతూ, లేస్తూ-కూర్చుంటూ స్మృతి చేయండి, అప్పుడే సంతోషములో ఉంటారు. ఏదైనా ఇబ్బంది ఉంటే అడగండి. అంతేకానీ, బాబా, మేము మీవారిగా అయిపోయాము, ఇప్పుడిక మేము మీ వద్దే కూర్చుండిపోతాము అని అనేటువంటి పేదవారిలా ఉండకూడదు. అలా అయితే ప్రపంచములో పేదవారు ఎందరో ఉన్నారు. వారంతా, మమ్మల్ని మధుబన్ లో పెట్టుకోండి అని అంటారు, అలాగైతే లక్షలాది మంది పోగవుతారు, ఇది కూడా నియమం కాదు. మీరు గృహస్థ వ్యవహారములో ఉండాలి, ఇక్కడ అలా ఉండడానికి అవ్వదు.

వ్యాపారాలలో ఎల్లప్పుడూ ఈశ్వరార్థము ఒకటి-రెండు పైసలను తీస్తారు. బాబా అంటారు - అచ్చా, మీరు పేదవారు

కావున ఏమీ తీయకండి కానీ జ్ఞానాన్ని అయితే అర్థం చేసుకోండి మరియు మన్మనాభవగా అవ్వండి. మీ మమ్మా ఏమి తీసుకువచ్చారు, కానీ వారు జ్ఞానములో చురుకైనవారు. తనువు, మనస్సు ద్వారా సేవ చేస్తున్నారు. ఇందులో ధనము యొక్క విషయమేమీ లేదు. ఎక్కువలో ఎక్కువ ఒక రూపాయి ఇవ్వండి, మీకు షావుకారులకు లభించినంతగా లభిస్తుంది. మొదట మీ గృహస్థ వ్యవహారాన్ని సంభాళించాలి, పిల్లలు దుఃఖితులుగా అవ్వకూడదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాతా-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. వందేమాతరం, సలామ్ మాలేకమ్, మీకు జయ జయ జయహో... ఓం శాంతి.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తర్వాత ఆలోచించాల్సి వచ్చే విధమైన, పశ్చాత్తాపపడవలసి వచ్చే విధమైన కర్మలేవి చేయకండి. అబద్ధం చెప్పకూడదు. సత్యమైన తండ్రితో సత్యముగా ఉండాలి.

2. భారత్ ను స్వర్గముగా తయారుచేయడంలో మీ ఒక్కొక్క గవ్వను సఫలం చేసుకోవాలి. బ్రహ్మాబాబా సమానంగా సరెండర్ అయ్యి ట్రస్టీలుగా అయ్యి ఉండాలి.

వరదానము:- ప్రతి ఆత్మ యొక్క సంబంధ-సంపర్కములోకి వస్తూ అన్ని ప్రశ్నల నుండి దూరంగా ఉండే సదా ప్రసన్నచిత్త భవ

ప్రతి ఆత్మ యొక్క సంబంధ-సంపర్కములోకి వస్తూ ఉన్నప్పుడు ఎప్పుడూ మనస్సులో - వీరు ఇలా ఎందుకు చేస్తారు లేక ఎందుకు అంటారు, ఈ విషయం ఇలా కాదు, ఇలా ఉండాలి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవ్వకూడదు. ఎవరైతే ఈ ప్రశ్నల నుండి దూరంగా ఉంటారో, వారే సదా ప్రసన్నచిత్తులుగా ఉంటారు. కానీ ఎవరైతే ఈ ప్రశ్నల క్యూలోకి వెళ్ళిపోతారో, రచనను రచిస్తారో వారు వాటిని పాలన కూడా చెయ్యాల్సి ఉంటుంది. సమయాన్ని మరియు శక్తిని కూడా వెచ్చించాల్సి ఉంటుంది, అందుకే ఈ వ్యర్థ రచన యొక్క బర్త్ కంట్రోల్ చేయండి.

స్లోగన్:- మీ నయనాలలో బిందు రూపుడైన తండ్రిని ఇముడ్చుకున్నట్లయితే వేరే ఏదీ ఇమడలేదు.